గాని, ఇంత లేటయిందేమిటి?, అని వసుదేవన్ ఇంటికి వెళ్ళగానే వాళ్ళావిడ అడిగింది.

'టీ పార్టీ, ఫోటో, స్పీచిగళు ఎల్లాం సేరింది లేటాచ్చి' అని అతను చెప్పిన సమాధానం ఆవిడని సమాధాన పరచలేదు.

"అయినా మరీ యింత లేటా?"

"మరి వాళ్ళిచ్చిన వన్నీ అమ్ముకుని రావడానికి కొంత ఆలస్యం అయింది!"

"వాళ్ళేమిటిచ్చారు? అవన్నీ మీరు అమ్మేయడమేమిటి!" అందావిడ.

"లేకపోతే ఏమిటి, వాళ్ళ ఉద్దేశం? రిటైరయిపోగానే ఓ మూలని క్రిష్ణారామా అంటూ కూర్చోమని కాబోలు! ఈజీ చైరు, చేతి కర్ర, భగవద్గీత!!" అని చిందులు తొక్కేడు వసుదేవన్.

"అయ్యో, అయ్యో! అన్నీ అమ్మేశారుటండీ?"

"అమ్ముతానా అమ్మి పారేస్తానా? నా కింకా ముసలితనం రాలేదని వాళ్లకి తెలియక పోతే నీకు తెలియదా?" అని వసుదేవన్ ఆవిడ దగ్గరసా వెళ్లి తన శక్తిని ప్రదర్శించబోయేటంతలో ఆవిడ వొళ్లు దాచుకుని స్వీట్లూ అవీ పెట్టిన సంచిలోంచి ఒక కవరు లాగి "ఇదేమిటండోయ్" అంది.

"అదా? సంబంధం అండ్ కో అని, మన వాళ్ళే. ఇక్కడ ఏదో వ్యాపారం చేస్తున్నారు. నేను సర్వీసులో ఉండగానే వాళ్ళతో సంబంధం పెట్టుకున్నాను కదా. రేపట్నించి వాళ్ల కంపెనీకి వచ్చి ఎకౌంటెంటుగా పనిచెయ్యమని ఆర్డర్". ★

# 7. బాకీ

వెనకటికి ఒక జోక్ -

సూర్యారావు దగ్గిర సుబ్బారావు వంద రూపాయలు అప్పు తీసుకున్నాడు. "మళ్లీ ఎప్పుడిస్తావు?" అని సూర్యారావు అడిగేడు. "మద్రాసు వెళ్తున్నాను. రాగానే ఇచ్చేస్తాను-" అన్నాడు సుబ్బారావు.

రెండు నెలలయింది. సుబ్బారావు కనిపించడం లేదేమా అని విచారించి సూర్యారావు అతని ఆఫీసుకి వెళ్ళి అతన్ని కలుసుకున్నాడు. "ఏమయ్యా వంద రూపాయలు అప్పు పట్టుకెళ్ళావు! మద్రాసు నుంచి రాగానే ఇచ్చేస్తానన్నావు. ఇదేనా, మర్యాద?" అని అడిగాడు.

"అవును, నేనింకా మద్రాసు వెళ్లలేదుగా. వెళ్లిరాగానే ఇచ్చేస్తాను, నిజం" అన్నాడు సుబ్బారావు.

నా పని అలాగయింది నారాయణ మూర్తితో. అప్పుడెప్పుడో వాళ్లావిడికి సీరియస్‌గా వుందని అర్జంటుగా ఆపరేషననీ చెప్పి అయిదు వందలు తీసుకున్నాడు. ఏడాది దాటింది. ఎప్పుడడిగినా ఖర్చులు, జీతంలో కటింగులు అంటాడే గాని తీసుకున్న డబ్బు తిరిగి ఇచ్చే ప్రసక్తి తేడు. చివరికి విసిగి, వాళ్ల ఎకౌంట్స్ ఆఫీసర్ అయిన రావుగారితో చెప్పుకున్నాను. నారాయణమూర్తికి జీతంకాక ఏవిధమైన అరియర్సో, రుణమో అయిదువందలకి మించి గానీ

వస్తుందని తనకి తెలిస్తే నాకు తెలియజెయ్యమని మొరపెట్టుకున్నాను. రావుగారికి తెలియకుండా నారాయణ మూర్తికి ఎలాంటి డబ్బూ అందదు, ఏ లాటరీ టిక్కెట్టు బాపతో తప్ప.

చివరికి రావుగార్నించి ఫోన్ వచ్చింది. "నారాయణ మూర్తికి ఇవాళ రెండువేల అయిదు వందలు అందుతోంది. మీరు చెప్పమన్నారు గనకా చెబుతున్నాను."

ఆ మాట పుచ్చుకుని నారాయణ మూర్తి పనిచేస్తున్న ఆ సెంట్రల్ గవర్నమెంట్ ఆఫీసుకి వెళ్లాను. వెళ్లడం వెళ్లడం తిన్నగా కాష్ కౌంటర్ దగ్గరికే వెళ్లాను. అదీ, మంచి సమయం చూసి వెళ్ళినట్టున్నాను. నారాయణమూర్తి పరధ్యానంగా (అదే, ఏకాగ్రంగా) నూరు రూపాయల నోట్లు లెక్క పెట్టుకుంటూ వుండగా అతన్ని "రెడ్ హాండెడ్"గా పట్టుకున్నాను. "నమస్కారం నారాయణమూర్తిగారూ!" అని పలకరించాను, సాధ్యమైనంత వ్యంగ్యం గొంతుకులో పోసుకుని, అతనెంత గుండెలు తీసిన బంటు కాకపోతే, ఆ వంద రూపాయలు నోట్లు దాచేసుకోకుండా ఆ చేతుల్తోనే నాకు ప్రతి నమస్కారం చేసి నావేపు నవ్వుతూ చూడగలడు?

"అందులో ఓ అయిదుకాయితాలు ఇలా పారేస్తారేమిటి!" అన్నాను; ఇంకెలా తప్పించుకుంటావులే-అన్న ధైర్యంతో.

"అబ్బే! ఇది ఎల్.టి.సి. డబ్బు సార్! ఇందులో మనకేమీ మిగలదు. పైగా పదిహేను వందలదాకా చేతి సొమ్ము పడుతుంది. అది ఎక్కడో గోకాలి ఇప్పుడు" అన్నాడతను నవ్వుతూ.

1987తో అంతమయ్యే నాలుగేళ్ల శ్లాబ్ పూర్తయిపోతోందని, ఎరన్డ్ లీవు పొంగిపొర్లి పోతోందనీ ఈ ఖర్చులో దిగాడట. వాళ్ల రూల్సు ప్రకారం భారతదేశంలో ఎక్కడికైనా సరే తన చిత్తం వచ్చిన చోటికి కుటుంబంతో సహా వెళ్లి రావడానికి ఫస్టు క్లాసు రైలు ఛార్జీలు ప్రభుత్వం భరిస్తుందిట. నాలుగేళ్లకొకసారి వచ్చే ఈ అపూర్వ అవకాశం వదల్లేక దీనికి సిద్ధపడ్డాడట.

"అలాగా? ఏవూరెడుతున్నారు?"

"ఢిల్లీ వెళ్తాం, అక్కడ రెండు రోజులుండి ఆగ్రా వచ్చి తాజ్‌మహల్ చూస్తాం. అక్కణ్ణించి నాగపూర్ వచ్చి మా ఆవిడ పినతండ్రి గారింట రెండ్రోజులుండి వరంగల్ వస్తాం. వరంగల్లో మా అన్నయ్యున్నాడు, మీకు తెలుసుగా? వరంగల్లో మా ఆవిడనీ, పిల్లల్నీ వదిలేసి నేను హైద్రాబాదు వెళ్లి అక్కడ కొన్ని పన్లు చూసుకుని మళ్లీ వరంగల్ వచ్చేస్తాను. ఎల్లుండి బయల్దేరి వచ్చేనెల పదో తారీక్కి ఇంటికి చేరుతాం."

"మంచి ప్రోగ్రామే" అన్నాను.

నారాయణమూర్తి కుటుంబం మొత్తం అయిదు టిక్కెట్లు, రైలు ఖర్చులు ప్రభుత్వం భరించినా అతని చేతికి కొంత తగుల్తుంది. నిజమే. ఏవూరెడితే ఆ వూళ్లో చుట్టాలున్నా, గూడుకీ కూడుకీ ఖర్చులేకపోయినా సాదర్లు అవుతాయి. ఆయా బంధువులకి ఈ ఐదుగురూ అనుకోని అతిథులుగా తగలడం వల్ల కొంత ఖర్చూ కొంత రచ్చా అవుతుంది కదా-అని వాళ్ల మీద జాలిపడి, ఆ లెక్కలోనే నా మీద కూడా నేను కొంత జాలిపడ్డాను.

పది రోజులైంది. ఇంట్లో ఏదో ఇబ్బందొచ్చి మా ఆవిడ "నారాయణమూర్తి గారు ఐదు వందలియ్యాలికదా; అడక్కూడదు?" అంది.

"అతను ఊళ్ళో లేడే" అన్నాను.

"పది రోజుల్నించి రోజుకి రెండుమాట్లు ఈ వీధిలో కనబడుతూ వుంటే! గవరయ్యాగారికి బురదపేటలో వున్న ఇంటి స్థలం మీ నారాయణ మూర్తి కొన్నార్టగా. నిన్న రిజిస్ట్రేషను కూడా అయిందట!''అంది మా ఆవిడ.

"అన్యాయం!'' అనుకున్నాను, నాలో నేనే.

"ప్రావిడెంటు ఫండులోంచి ఐదువేలు అప్పుతీసేరట. వాళ్లావిడ బంగారం అమ్మగా వొచ్చింది పన్నెండు వేలుట... ఇంకేదో బాపతు రెండు వేలు ఆయన దగ్గర చేరేయట. మొత్తం పదహారు వేలు స్థలం ఖరీదు, ఓ వెయ్యి రిజిస్ట్రేషనూ కాగా ఇంకా ఆయన దగ్గిర కొంత డబ్బు మిగిలుండాలి మరి; వాళ్ల ఆవిడ చెప్పిన లెక్క ప్రకారం'' అంది మా ఆవిడ.

"అతనూ వాళ్లావిడా పిల్లలూ ఢిల్లీ వెళ్లేరుకదా, ఆవిడ నీకెలా కనిపించింది, ఎప్పుడు కనిపించింది?'' అన్నాను.

"ఢిల్లీ కాదుకదా, అనకాపల్లి అయినా వెళ్లలేదు. ఎవర్ని గురించి మీరు విన్నారో!'' మాచెడ్డ కోపం వచ్చింది. పరుగెత్తుకెళ్ళి అడిగాను " ఏమన్న పెద్ద మనిషి అండీ మీరు? ఢిల్లీ వెళ్తానని గవర్నమెంటు సొమ్ము తీసుకుని ఇల్లు కదలకుండా ఇల్లు కడుతున్నారుట?''

"అంతా అనుకోకుండా జరిగిపోయిందండీ, నిజంగా టిక్కెట్లు కొందామనే వెళ్లేను రైల్వే స్టేషనుకి, అక్కడ ఒక ఫ్రెండు కనబడి ఢిల్లీ వెళ్లడం మానెయ్యమని సలహా ఇచ్చేడు. అతనూ వాళ్లావిడా పిల్లలు ముగ్గురూ, ఫస్టు క్లాసులోనే ఏదో తప్పనిసరి పరిస్థితుల్లో ఢిల్లీ వెళ్లవలసి వచ్చిందట. ఆ టిక్కెట్లన్నీ మా పేర్లతో రాయించి, అందుకు ప్రతిఫలంగా ఓ అయిదువందలు నా దగ్గిర తీసుకుని ఆ టిక్కెట్లన్నీ నాకిచ్చేశాడు. ఇంటి స్థలం కొన్నమాట నిజమే అనుకోండి. కాని పోగుచేసిన డబ్బంతా అయిపోయిందండీ. ఓ ఐదు వందలు మిగుల్తుంది. మీ బాకీ తీర్చేద్దాం అనుకున్నానుగానీ ఆ టిక్కెట్ల ఏర్పాటుకి అయిదు వందలు ఇవ్వవలసి వచ్చింది కదా....!'' అన్నాడు నారాయణమూర్తి.

"మా బాగా చేసేర్లెండి; అవుసరానికి అప్పు పెట్టినందుకు!'' అన్నాను కఠినంగా.

నారాయణమూర్తి నా వీపు తట్టి ధైర్యం చెప్పేడు, "మీరేం అధైర్యపడకండి. ఈ రానూపోనూ టిక్కెట్లన్నీ కలిపి మొత్తం మూడువేల ఆరువందలవుతుంది. అందులో ఆ వేళ అడ్వాన్స్ తీసుకున్నది రెండు వేల అయిదు వందలు. రేపు ఆఫీసులో జాయిన్ అవగానే బిల్లు పెట్టేసి మిగతా డబ్బు తీసుకుని మీ బాకీ ఇచ్చేస్తాను''

అతను గవర్నమెంటుని; (అంటే ప్రజల్ని) మోసం చేసేడు. పైగా తను ఢిల్లీ వెడుతున్నానని సెలవు పెట్టి ఈ వూరి రిజిస్ట్రార్ ఆఫీసులో తన పేరిట ఇంటిస్థలం రిజిస్టర్ చేయించుకున్నాడు. అతనికీ, అతనిలాంటి వాళ్లకి శిక్ష పడేటట్టు చేసి నిజమైన బాధ్యతగల పౌరుడిగా రుజువు పరుచుకోవాలని కోరిక కలిగింది.

మరుక్షణం "అతనెలా పోతే నాకెందుకు? నాకతను ఇయ్యవలసిన ఐదువందలూ ఇచ్చేస్తున్నాడు. అదే పదివేలు'' అని సమాధానపడిపోయాను.

★